క్లుప్తంగా

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


డీఎస్పీ పి.రామక్రిష్ణుడు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి సబ్ డివిజనల్ అధికారిగా పి.రామక్రిష్ణుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కె.జనార్దన్‌నాయుడుకు అదనపు ఎస్పీగా పదోన్నతి లభించింది. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇక్కడ డీఎస్పీ పోస్టు ఖాళీ ఏర్పడింది. విజయవాడ ఇంటిలిజెన్స్‌లో ఉన్నటువంటి పి.రామక్రిష్ణుడును తాడిపత్రి డీఎస్పీగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో కె.జనార్దన్‌నాయుడు నుంచి బాధ్యతలు స్వీకరించారు. కె.జనార్దన్‌నాయుడు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. నూతన డీఎస్పీకి కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. సబ్‌డివిజనల్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు మర్యాద పూర్వకంగా కలసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏడీజేకు సన్మానం



ఏడిజే మహేష్, తండ్రి మునయ్యను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: చిత్తూరు జిల్లా పీలేరు ఏడీజేగా నియమితులైన తాడిపత్రికి చెందిన న్యాయవాది మహేష్‌ను తాడిపత్రి బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సన్మానించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. మహేష్ తండ్రి మునయ్య తాడిపత్రి కోర్టులో సీనియర్ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. తాడిపత్రి కోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్న మహేష్ ఏడీజేగా నియమితులవడంపై తాడిపత్రి బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, సీనియర్ న్యాయవాదులు రమేష్‌నాథ్‌రెడ్డి, ఎన్వీ భాస్కర్‌రెడ్డి, ఆర్పీ రజినీకాంత్ రెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ రజాక్‌వలి

తాడిపత్రి రూరల్: తాడిపత్రి తహసీల్దార్‌గా రజాక్‌వలి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా తాడిపత్రికి ఆయనను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

నేరాల సంఖ్య తగ్గించండి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె: నేరాల సంఖ్య తగ్గించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు.శుక్రవారం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ పోలీస్ స్టేషన్ లో పలు రికార్డులు పరిశీలించారు.అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఫిర్యాదుదారుల పట్ల స్నేహపూర్వకంగా ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చే యాలన్నారు. 44వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా నివారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి ఉరుసు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న హజరత్ సయ్యద్ షా దర్గా వద్ద ఈ నెల 23 నుంచి 25 వరకూ ఉరుసు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 23 గంధం, 24న ఉరుసు, 25న జియారత్ నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

హామీలన్నీ నెరవేరుస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు రూరల్: హామీలన్నీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కసాపురంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గ్రామంలోని చౌడేశ్వరీ ఆలయం వద్ద రూ.8 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. త్వరలోనే ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీవీ మాధవి, స్పెషల్ ఆఫీసర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో శ్రీకాంత్ చౌదరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులు పూర్తయినా ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదు. అమ్మ ఒడి అందక మహిళలు పిల్లలకు ఫీజులు కట్టలేకపోతున్నారు. రైతు భరోసా, పెట్టుబడి సాయం అందక అన్నదాతలు పంటలు సాగు చేయలేకపోతున్నారు. ఉద్యోగాలు దక్కక, నిరుద్యోగ భృతి అందక యువత అవస్థలు పడుతున్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల్లో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఆవేదన చెందుతున్నారు.


గుంతకల్లులో ప్రత్నామ్నాయ పరిశ్రమలకు నోచుకోని ఏసీఎస్ మిల్లు


పామిడిలో నిరుయోగంగా ఉన్న చేనేత జౌళి శాఖ టెక్స్‌టైల్ పార్కు

కోటలు దాటిన హామీలు..
గుమ్మం దాటని ఆచరణ



- వంద రోజుల పాలనలో పడకేసిన అభివృద్ధి
- చుట్టపుచూపుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం
- అధికారిక కార్యక్రమాల్లో 'తమ్ముళ్ల' హల్‌చల్

గుంతకల్లు: సమగ్రాభివృద్ధే లక్ష్యం..ప్రజా సంక్షేమమే నా ధ్యేయం అన్న నినాదంతో ప్రజల్లోకి వెళ్లిన గుమ్మనూరు జయరాం తన వందరోజుల పాలనలో చేసిన అభివృద్ధి చేసింది శూన్యమని గుంతకల్లు నియోజవకర్గ ప్రజలు చెప్పుకుంటున్నారు. దాదాపు 100కు పైగా హామీల్లో ఒక్కటీ కూడా అమలుకు నోచుకోలేదు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి గుంతకల్లు నియోజకవర్గంలో ఎక్కువగా అందుబాటులో లేకపోవడంతో ప్రతి కార్యక్రమంలో ఆయనే సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణస్వామి, ఇక గుత్తిలో సమీపం బంధువు గుమ్మనూరు నారాయణ ఎక్కువగా హాజరువుతున్నారు. ఏదైనా సమస్యను చెప్పుకోవడానికి వెళ్లిన ప్రజలకు ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో వెనుతిరిగే పరిస్థితి. దీంతో గుంతకల్లు నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ సమస్యలు అక్కడే నిలిచి పోయాయి. ప్రధానంగా తాగునీటి సమస్యతో నియోజకవర్గ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక రోడ్లు సమస్య వేధిస్తోంది. హామీలపై ఎమ్మెల్యే దృష్టి సారించి నెరవేర్చాలని ప్రజలు కోరారు.

నియోజకవర్గం	గుంతకల్లు
మండలాలు	గుంతకల్లు, గుత్తి, పామిడి
జనాభా:	3,00,000
ఓటర్ల సంఖ్య	2,70,648



ప్రచార సమయంలో గుమ్మనూరు హామీలు ఇలా..



గుంతకల్లు మండలంలో..

హంద్రీనీవా కాలవ ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపడంతోపాటు అవరసమైన గ్రామాలకు సాగునీరు ఇవ్వడం. ఆగిపోయిన టిడ్కో ఇళ్లను పూర్తి చేయడం. గుంతకల్లు మున్సిపాలిటీని ఆదర్శంగా అభివృద్ధి చేయడంతోపాటు రోడ్లు విస్తరణ చేయడం. ఆర్టీసీ బస్టాండ్‌ను మరింత అభివృద్ధి చేయడం. స్పిన్నింగ్ మిల్లు సమస్యను పరిష్కరించి ప్రత్నామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేయడం. కసాపురం రైల్వే మోరీ, ధర్మవరం రైల్వే ఎల్‌గేట్‌ను తొలగించి యూ ఆకారం అండర్ బ్రిడ్జి ఏర్పాటు. అయితే మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ధర్మవరం రైల్వే గేట్, కసాపురం మోరీ విస్తరణకు ప్రత్యేక చొరవ చూపడంతో ఇప్పటికే ధర్మవరం వద్ద యూ ఆకారం అండర్ బ్రిడ్జికు భూమి పూజ కూడా చేశారు. ఇక కసాపురం రైల్వే మోరీ విస్తరణ ఫైల్ సిద్ధం ఉంది. వీటిపై ప్రసుత్త ఎమ్మెల్యే జయరాం ప్రత్యేక చొరవ చూపితే ఈ పనులు పూర్తి కావచ్చు. కియా తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయించి నిరుద్యోగ భృతికి కృషి చేస్తామన్నారు. గుంతకల్లు పట్టణంలో ట్రాఫిక్ పోలీసు సేష్టన్, పాతకొత్త చెరువును పర్యాటక రంగం ద్వారా బోటింగ్, హోటల్స్, రెస్టారెంట్‌లను స్థాపించడం.

గుత్తిలో..

గుత్తిలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు గుత్తి చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చి తాగునీరు రోజూ అందజేయడం. గుత్తి కోటను పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేయడం. ఫైర్‌స్టేషన్ ఏర్పాటు. ప్రభుత్వాస్పత్రిని వందపడకలుగా మార్చడంతోపాటు బ్లడ్ బ్యాంకు ఏర్పాటు. విద్యార్థుల కోసం ప్రభుత్వ డీగ్రీ కళాశాల, ఐటీఐను ఏర్పాటు.



గుత్తిలో ట్యాంకర్ల వద్ద నీరు పట్టుకుంటున్న దృశ్యం

పామిడిలో..

పామిడిలో వస్త్ర పరిశ్రమను టెక్స్‌టైల్స్ పార్కుగా మార్చడంతోపాటు నిరుయోగంగా ఉన్న గార్మెంట్ హబ్‌ను వాడకంలోకి తేవడం. పామిడి ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేయడం. పెన్న పరివాహక ప్రాంతాన్ని పరిరక్షించడంతోపాటు అభివృద్ధి పరచడం. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టంను అందుబాటులోకి తీసుకురావడం. రోడ్లు వేయడం. ఇలా అనేక హామీలను గుప్పించిన గుమ్మనూరు జయరాం తన వందరోజుల పాలన వీటిపై ఏ మాత్రం దృష్టి సారించలేదని ప్రజలు విమర్శింస్తున్నారు.

పాలన గాడి తప్పింది



నియోజకవర్గంలో పరిపాలన స్తంభించి పాలన గాడి తప్పింది. జయరాం ఎన్నికల ముందు చెప్పింది ఒకటి ఇప్పుడు చేస్తోంది మరొకటి. గుంతకల్లు నియోజకవర్గ ప్రజలకు ఈ వందరోజుల పాలనలో చేసింది ఏమీ లేదు. కనీసం ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించకపోగా కేవలం ధనార్జనే ధ్యేయంగా ముందుకు పోతున్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో మండలాలకు ఇన్‌చార్జులు నియమించుకుని కుటుంబ పాలన సాగిస్తున్నారు.

– వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుంతకల్లు

వేధిస్తున్న తాగునీటి సమస్య



అధికారంలోకి వచ్చిన వెంటనే తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. గుమ్మనూరు జయరాం గెలిచి అధికారంలోకి వచ్చి సూమరు నాలుగు నెలలు కావస్తోంది. అయినా తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. ప్రసుత్తం నెలకు ఒకసారి కూడా కుళాయిలకు తాగునీరు వదలడం లేదు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే ఎమ్మెల్యే జయరాం తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– దాదాఖలందర్, గుత్తి

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలి



పామిడిలో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి వర్షం వస్తే డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లి రోడ్లపై మురుగు నిల్వ ఉంటోంది. దీంతో మురుగునీటిలోనే తొక్కుకుంటు పాదచారులతోపాటు వాహనాదారులు వెళ్లాల్సిన పరిస్థితి. ఎమ్మెల్యే జయరాం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అండర్ డ్రైనేజ్ సిస్టం ఏర్పాటు చేయాలి. అలాగే పామిడిలో వస్త్ర పరిశ్రమను టెక్స్‌టైల్స్ పార్కుగా మార్చాలి.

– అబ్దుల్ రజాక్, పామిడి

పేద పిల్లలకు వైద్య విద్య దూరం చేయడం తగదు


నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



గుత్తిలో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి: పేద, మధ్యతరగతి పిల్లలను వైద్య విద్యకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేయడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్ మండిపడ్డారు. రాష్ట్రంలో వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం పట్టణంలోని పొట్టిశ్రీ రాములు సర్కిల్‌లో నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వైద్యవిద్యకు పెద్దపీట వేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం మెడికల్ కాలేజీలకు మంజూరైన సీట్లను కుదించాలని ఎన్ఎంసీకి లేఖ రాయడం దౌర్భగ్యమన్నారు. నిర్మాణదశలో ఉన్న 12 మెడికల్ కాలేజీ పనులను పూర్తి చేయించి ఆయా కాలేజీలకు ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేయాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కిశోర్, సమీర్, మణికంఠ, సాయి, చందు, ఫిరోజ్, వంశీ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తిలోని గాంధీ సర్కిల్ వద్ద ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, జిల్లా కార్యదర్శి పరమేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు వైద్య విద్యను ప్రవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గాంధీ సర్కిల్ వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలు, నవీన్ యాదవ్, శివ, శశి కుమార్, వినోద్ కుమార్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు రేడియమ్ సేఫ్టీ ట్యాగ్స్

తాడిపత్రి: ప్రతి ఒక్కరూ మూగజీవాలపై ప్రేమ చూపాలని తంగుటూరు బాలయ్య శ్రేష్టి బంగారు అంగడి నిర్వాహకులు హరీష్‌కుమార్, చైతన్య లక్ష్మి దంపతులు అన్నారు. గురు, శుక్రవారాల్లోని రాత్రి సమయాల్లో తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీ, నూతన కూరగాయల మార్కెట్, పోలీస్‌స్టేషన్ సర్కిల్ తదితర ప్రాంతాల్లోని సీబీ రోడ్డు ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఆవులు, దూడలకు వారు సొంత ఖర్చులతో రేడియం స్టిక్కర్‌తో కూడిన సేఫ్టీ ట్యాగ్‌ను వాటి మెడలో యానిమల్ హస్బెండరీ సిబ్బంది సహకారంతో తొడిగారు. వారు మాట్లాడుతూ తాడిపత్రిలో రహదారులపైకి వస్తున్న జీవాల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. పశువుల మెడలో రేడియం స్టిక్కర్‌తో కూడిన ట్యాగ్ రిబ్బన్ వేయడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వంగనూరు, చిన్నపొలమడ, ఊరుచింతల, గన్నెవారిపల్లి కాలనీ వన్, పుట్లూరు మండలం శెనగల గూడూరుకు చెందిన ఏహెచ్ఏలు మురళీ, రవితేజ, మాబూస్నా, వెంకటస్వామి, మమత పాల్గొన్నారు.


రాత్రి వేళ రహదారిపై పశువులకు రేడియం సేఫ్టీ ట్యాగ్‌లను తొడుగుతున్న జంతు ప్రేమికులు

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ


యాడికిలో విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి

గుంతకల్లుటౌన్/గుత్తి/శింగనమల/యాడికి/గార్లదిన్నె: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గుంతకల్లు మండల విద్యాధికారి సుబ్బరాయుడు సూచించారు. శుక్రవారం గుంతకల్లులోని ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు జరిగాయి. అండర్-14, 17 కేటగిరిల్లో బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్‌తో పాటు వివిధ క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ వేణుగోపాల్ , హెచ్ఎం భూపాల్‌రెడ్డి, పీడీలు తబిత, జ్యోతి, తదితరులుపాల్గొన్నారు. అలాగే గుత్తిలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ స్కూల్ గేమ్స్ ప్రారంభించారు. పీఈటీలు పుష్పరాజ్, సరోజ, స్రియన్, శ్యామల, దాదా ఖలందర్, కృష్ణ, కాంచన పాల్గొన్నారు. శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీల్లో ఎంఈఓ-2 శివప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, పీఈటీలు నందకుమార్, శివమ్మ, నరసింహారెడ్డి, నరేంద్రరెడ్డి, బయపరెడ్డి, సువర్ణ, కే. నరసింహారెడ్డి పాల్గొన్నారు. యాడికి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగన్న ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఎంపీపీ బొంబాయి ఉమాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఎంపీటీసీలు నాగరాజు, రామ్మోహన్ పాల్గొన్నారు. గార్లదిన్నె మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ మైదానంలో క్రీడలను ఎంఈఓ చంద్రనాయక్ ప్రారంభించారు.

ఘనంగా 'స్వచ్ఛతా హీ సేవ'

తాడిపత్రి రూరల్/యాడికి/శింగనమల/పామిడి: తాడిపత్రిలోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలన్నారు. అలాగే యాడికి మండలంలోని కోనుప్పలపాడు శింగనమల, పామిడిలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శింగనమలలోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు స్వచ్ఛత సేవపై అవగాహన కల్పించారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,550 స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి, నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

ముగ్గురి ప్రాణాలు కాపాడిన వైద్యులు

గుత్తి: గుత్తి వైద్యులు శుక్రవారం ముగ్గురు ప్రాణాలను కాపాడారు. వివరాలు.. పట్టణంలోని కోట వీధికి చెందిన వెంకటరమణ, కమేశా వీధికి చెందిన ఈశ్వరమ్మ, గుత్తి మండలం గాజులపల్లికి చెందిన మల్లేశ్వరమ్మ కేవలం రెండు గంటల వ్యవధిలో గుండెపోటుతో గుత్తి ప్రభుత్వాస్పత్రిని ఆశ్రయించారు. వెంటనే సూపరింటెండెంట్ ఎల్లప్ప, వైద్యుడు రాజేష్ ముగ్గురికీ టెనాక్టప్లస్ ఇంజెక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు. అనంతరం వారిని అనంతపురం రెఫర్ చేశారు. రోగులు, వారి కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

పెద్దపప్పూరు: మండలంలోని చింతరపల్లిలో ఏకాంగేశ్వరస్వామి ఆరాధనోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఏటా భాద్రపద మాసంలో స్వామి ఆరాధనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెన్నటం మఠాధిపతులు, గ్రామస్తులు తెలిపారు. శనివారం స్వామికి అభిషేకాలు,అర్చనలు నిర్వహించి ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు నిర్వాహకులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.55 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ సాయిప్రసాద్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో నందలపాడుకు చెందిన పాల మాబు, టైలర్స్‌కాలనీకి చెందిన అబ్దుల్లా, అంబేద్కర్‌నగర్‌కు చెందిన శివయ్యను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

యల్లనూరు: గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాంప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం తిరుమలాపురం, వాసాపురం, కూచివారిపల్లి తదితర ఫ్యాక్షన్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు లేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడులో పొలానికి వెళ్లే రస్తా విషయంలో శుక్రవారం గొడవ చోటు చేసుకొంది. ఈ ఘర్షణలో హాజీ అనే వ్యక్తి జిలాన్బీ, ఆమె కుమారుడు అల్లావలి లపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు హాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు.

బర్నింగ్‌శాలను ప్రారంభించండి

గుంతకల్లు: పట్టణంలోని సత్యనారయణపేటలో శ్మశాన వాటిక సమీపంలో లక్షలాది రూపాయలు ఖర్చుతో నిర్మించిన బర్నింగ్‌శాలను వెంటనే ప్రారంభించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ నాయకులు సత్యనారాయణపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా బర్నింగ్ శాలను పరిశీలించడంతోపాటు మురికి నీరు శుద్ధి రిజర్వాయర్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. శ్మశానంలో భారీగా పెరిగిన చెట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, మల్లయ్య, ప్రసాద్, నూర్‌బాషా, పుల్లయ్య, నందు, అఖిల్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.